క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురిపై కేసులు



అల్లాదుర్గంలో డ్రంకెన్ డ్రైవ్ చేస్తున్న ఎస్‌ఐ

అల్లాదుర్గం(మెదక్): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై శంకర్ హెచ్చరించారు. అల్లాదుర్గంలో ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాలు మద్యం తాగి నడపడం వల్లనే జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. లైసెన్సు లేకుండా, మైనర్లు వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ గాలయ్య పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న ఉత్సవాలు



నార్సింగి మండల కేంద్రంలోని పీసుగుల మల్లన్న ఉత్సవాల్లో బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో వెలసిన పీసుగుల మల్లన్న జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మృగశిర కార్తె రోజున నిర్వహించే ఆలయ ఉత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శిర్న చంద్రశేఖర్, బీజేపీ జిల్లా నాయకులు సత్యపాల్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఎల్‌ఓసీ అందజేత



లబ్ధిదారులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: కొల్చారం మండలంలోని అంసాన్‌పల్లికి చెందిన దుర్గాగౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో వైద్యం చేయించుకుంటున్నాడు. అతనికి ఆపరేషన్ కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన లక్ష రూపాయల ఎల్‌ఓసీని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం అందజేశారు. అనంతరం నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు



గాయపడిన కిషన్‌నాయక్

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్‌కు గాయపడిన సంఘటన మండలంలోని వడియారం శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. భారత్ గ్యాస్ గోదాం సమీపంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కిషన్‌నాయక్ గాయపడ్డారు. చేగుంటలో ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

గుండెపోటుతో యువకుడి మృతి



ముజాహిదిన్ అలీ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): బక్రీద్ పర్వదినాన ఓ ముస్లిం యువకుడు గుండెపోటుతో మరణించిన ఘటన పాపన్నపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ముజాహిదిన్ అలీ(40) హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. బక్రీద్ జరుపుకోవడానికి కుటుంబ సభ్యులతో పాపన్నపేటకు వచ్చాడు. శనివారం ఉదయం అస్వస్థతకు గురికాగా స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అనంతరం వేడుకల్లో పాల్గొని ఆనందంగా గడిపాడు. రాత్రికి గుండెపోటుకు గురై మరణించాడు. మెదక్ ఆస్పత్రికి తీసుకెళ్ళగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

జోరుగా చేపల విక్రయాలు



పెద్దశంకరంపేట మార్కెట్‌లో చేపల కొనుగోళ్లు

మృగశిర కార్తెను పురస్కరించుకొని ఆదివారం జోరుగా చేపల విక్రయాలు కొనసాగాయి. మృగశిర రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదనే పెద్దల మాటతో మండలంలోని గ్రామాల ప్రజలు భారీగా చేపలు కొనుగోలు చేశారు. ఇదే అదనుగా వ్యాపారులు చేపల రేట్లు అమాంతం పెంచేశారు.

నర్సాపూర్/చిలప్‌చెడ్/పెద్దశంకరంపేట(మెదక్):



చిట్కుల్‌లో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

సీహెచ్‌సీ నిర్మాణం పూర్తయ్యేనా?

మండలంలో కొత్తగా నిర్మిస్తున్న కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. కలెక్టర్ ఆదేశించిన ఫలితం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా నూతన భవన నిర్మాణం త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

– కౌడిపల్లి(నర్సాపూర్)

కలెక్టర్ ఆదేశించినా ఫలితం శూన్యం

- రోగులకు అందని మెరుగైన వైద్యం
- త్వరగా పూర్తిచేయాలని ప్రజల విజ్ఞప్తి



కౌడిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న సీహెచ్‌సీ

ఉమ్మడి కౌడిపల్లి (చిలిప్‌చెడ్) మండలానికి ఒకటే పీహెచ్‌సీ ఉంది. దీంతో అప్పటి ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి స్వగ్రామంలో 50 పడకలతో సీహెచ్‌సీని మంజూరు చేయించారు. తాత్కాలికంగా పీహెచ్‌సీలో ఆస్పత్రి కొనసాగుతుంది. సూపరింటెండెంట్‌తో పాటు వైద్యులు, సిబ్బందిని ఇన్‌చార్జిలుగా నియమించగా, స్టాఫ్‌నర్స్‌లతో పాటు ఏఎన్‌ఎంలు ఇతర సిబ్బందిని నియమించారు. ప్రస్తుతం పీహెచ్‌సీలోనే సీహెచ్‌సీ కొనసాగుతుంది. దీంతో సీహెచ్‌సీ నూతన భవనం కోసం ఎన్‌హెచ్‌ఎం (జాతీయ ఆరోగ్య మిషన్) ఎన్‌హెచ్‌ఎం నిధులు రూ. 9.61 కోట్లు మంజూరు చేసింది. టెండర్లు దక్కించుకున్న జోషిత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ 2022 అక్టోబర్ 2న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారు. ఏడాది కాలంలో భవనాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని చెప్పారు. అయినా ఇప్పటివరకు పూర్తి చేయలేదు. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలో కలెక్టర్ రాహుల్ రాజ్ సీహెచ్‌సీని అకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా నూతనంగా నిర్మాణంలో ఉన్న సీహెచ్‌సీ భవనాన్ని సైతం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేసి మార్చి చివరి నాటికి అందుబాటులోనికి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అయినప్పటికీ ఇంకా పనులు పూర్తికాలేదు. నూతనం భవనం త్వరగా పూర్తి అయితే రోగులకు సాధారన వైద్య సేవలతో పాటు అత్యవసర వైద్యం , ఆపరేషన్ సేవలు అందుబాటులోనికి రానున్నాయి. దీంతో రోగులు దూరప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానికంగానే వైద్యం అందనుంది. అధికారులు స్పందించి త్వరగా నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోనికి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

జూలై చివరి నాటికి పూర్తి చేస్తాం

సీహెచ్‌సీ నిర్మాణ పనులు జూలై వరకు పూర్తి చేసి అందుబాటులోనికి తీసుకువస్తాం. ఇప్పటికే భవనానికి రంగులు వేయడంతో పాటు టైల్స్ వర్క్ పూర్తి అయింది. డోర్లు, కిటికీలు బిగించే పనులతో పాటు మిగితా పనులు చేయాల్సి ఉంది. పనులు నాణ్యతగా ఉండేలా చూస్తూ త్వరగా పూర్తయ్యేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నాం.

– రవీందర్‌రెడ్డి, ఈఈ టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ

భయపెడుతున్న విద్యుత్ తీగలు



వేలాడుతున్న విద్యుత్ తీగలు

రేగోడ్(మెదక్): వేలాడుతున్న విద్యుత్ తీగలు భయపెడుతున్నాయి. వాటిని సరి చేయాలని ప్రజలు పదేపదే కోరుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇందిరమ్మ గృహ నిర్మాణం వద్ద విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. దీంతో పనులు నిలిచిపోయాయి. రేగోడ్‌లోని దుర్గమ్మ వీధిలో ఇటీవల లబ్ధిదారు విజయలక్ష్మి తనకు మంజూరైన ఇందిరమ్మ గృహ నిర్మాణం పనులు ప్రారంభించారు. కాని ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ తీగల వల్ల పనులకు అడ్డంకులు వస్తున్నాయని బాధితురాలు ఆదివారం వాపోయారు. ఆ తీగలను సరిచేయాలని అధికారులను కోరినా ఎవరూ పట్టించుకోలేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కలగానే పూర్తిస్థాయి వైద్యసేవలు!

- పీహెచ్‌సీ స్థాయి పెంపు ఎప్పుడు?
- పూర్తిస్థాయి వైద్య సేవలు అందక రోగుల ఇక్కట్లు



సాయత్రం 4 గంటలకే మూతపడిన శివ్వంపేట పీహెచ్‌సీ

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజలకు అతి ముఖ్యమైన వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలోనే పేరొందిన శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం స్థాయి పెంపు లేకపోవడంతో 24 గంటల వైద్య సేవలు కలగానే మిగిలిపోతున్నాయి. ప్రస్తుతం ఇద్దరు వైద్యులతోపాటు ఇతర సిబ్బందితో ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయత్రం 4 గంటల వరకు మాత్రమే వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. సాయత్రం 4 నుంచి ఉదయం 9 గంటల వరకు ఎవరికైనా ఆరోగ్య సమస్యలకు సంబంధించి ఎమర్జెన్సీ తలెత్తితే వైద్యం అందించే నాథుడే కరువయ్యారు. అర్ధరాత్రి వేళ కనీసం ప్రాథమిక చికిత్స సైతం అందుబాటులో లేకపోవడంతో 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న తూప్రాన్, నర్సాపూర్ పట్టణాల్లోని ఏరియా ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుంది. గతంలో అంబులెన్స్ అందుబాటులో ఉండటంతో పాటు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగాయి. ప్రస్తుతం ఆపరేషన్లు నిలిచిపోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో కనీసం మండల కేంద్రంలో ఆర్‌ఎంపీ వైద్య సేవలు కూడా అందని పరిస్థితి ఉంది.

పీహెచ్‌సీ స్థాయి పెంచాలి

మండల ప్రజలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందేందుకు గాను ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. సిబ్బందిని పెంచి 24 గంటల పాటు ప్రజలకు వైద్య సేవలు అందేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన వ్యక్తిగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవ తీసుకుని శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలు విస్తరించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కుర్తివాడలో ఆదివారం జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కుర్తివాడ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 2003–04 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 21 ఏళ్ల అనంతరం తమకు చదువులు నేర్పిన బడిలో కలుసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం తమతో కలసి చదివిన సహచరులతో నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో నాటి టీచర్లు బాల కిష్టయ్య, శంకర్, సీతారాం, మధుసూదన్ మాట్లాడారు. పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, విఠల్, సాయి, రాము, కిరణ్, సురేష్, నాగరాజు, రాజ్యలక్ష్మి, దుర్గ, సంయుక్త, సుమలత, కల్యాణి, సువర్ణ పాల్గొన్నారు.

నర్సాపూర్ రూరల్: మండలంలోని లింగాపూర్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం 25 యేళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులు ఘనంగా ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. శివ్వంపేట మండలం పిలుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000 – 2001లో పదో తరగతి చదువుకున్న వారంతా తమ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఉల్లాసంగా గడిపారు. విద్యనేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న సత్యనారాయణ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజిపేటలో మూడు రోజులుగా నిర్వహించిన ఏపీఎల్ క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిసాయి. మూడు రోజులుగా గ్రామంలోని పదిజట్లు పోటీపడగా, ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. విన్నర్‌గా ఎస్‌ఎస్ సూపర్‌కింగ్, రన్నర్‌గా ఆర్‌కేపీ లయన్ టీములు గెలుపొందాయి. సాన సురేందర్ సహకారంతో విజేతలకు బహుమతులు అందించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ బహుమతులను ప్రదానం చేశారు.

కొనసాగుతున్న బడిబాట



బద్యాతండాలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): బడీడు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ బడులలోనే చేర్పించాలని చిలప్‌చెడ్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రమేశ్ అన్నారు. మండల గ్రామాలలో ఆదివారం ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులతో కలసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు, భోజనం, యూనిఫామ్స్‌తోపాటు, నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఇంటింటికి తిరుగుతూ వివరాలు నమోదు చేస్తున్నామని, చదువు ఆపేసిన విద్యార్థులను బడిలో చేరేవిధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు.

మట్టి పరీక్షలు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పాపన్నపేట(మెదక్): ప్రతి రైతు మట్టి పరీక్షలు నిర్వహించుకోవాలని శాస్త్రవేత్త లు రవి, రమేష్, దాసు, చిన్నబాబు నాయక్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం వారు గాంధారిపల్లిలో జరిగిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతూ.. మట్టి పరీక్షలు చేయించడంతో తగిన పోషకాలు ఎంచుకోవచ్చని తెలిపారు. విత్తనాల ఎంచుకోవడంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రకృతి ,సేంద్రియ పద్ధతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. డ్రోన్లను వినియోగించుకోవాలని చెప్పారు. వ్యవసాయ సమాచారం పొందడానికి కిసాన్ సారధి పోర్టల్‌పై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగమాధురి, ఏఈఓలు జనార్దన్, రజిత, అభిలాష్, రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు అందజేస్తున్న సభ్యులు

మెదక్ కలెక్టరేట్: సమ్మర్ క్యాంపులో పాల్గొన్న క్రీడాకారులకు ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. నెల రోజులుగా మెదక్ అవుట్‌డోర్ స్టేడియంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా క్యాంపులో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలంటే క్రీడలు ఉపయోగపడతాయన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మహేందర్ రెడ్డి, స్పోర్ట్స్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు శివశంకర్ రావు, అథ్లెటిక్స్ జిల్లా కార్యదర్శి మధుసూదన్, సలీమ్, శ్రీనివాస్, అర్జున్, కోచ్ అరవింద్, ఫిజికల్ ట్రైనర్ మోహన్, రాజు ఇతరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండ



సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

కౌడిపల్లి(నర్సాపూర్): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి హ్యాపీలైఫ్ ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మండలంలోని కన్నారం గ్రామానికి చెందిన పానుగంటి శాఖయ్య గ్రామ పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల అతనికి ఊపిరితిత్తుల సమస్యతో అనారోగ్యం బారిన పడ్డాడు. హ్యాపీలైఫ్ దీంతో స్పందించిన ఫౌండేషన్ సభ్యులు బియ్యం, పప్పు, ఉప్పు, మంచినూనె, సబ్బులు తదితర మూడు నెలలకు సరిపడా సరుకుల పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు నరేష్, రాజశేఖర్‌గౌడ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం దానంపల్లిలో రెవెన్యూ సదస్సు ఉంటుందని, రైతులు తమ భూ సమస్యలపై దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చేగుంట(తూప్రాన్): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన చేగుంట హమాలీ కాలనీలో ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంజనేయులు ఇంటికి తాళం వేసి పనికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. బీరువాలో దాచి ఉంచిన బంగారు నగలు, వెండి వస్తువులతో పాటు రూ. పదివేలు నగదు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు భూ భారతి రెవెన్యూ సదస్సు

రేగోడ్(మెదక్): మండలంలోని టి.లింగంపల్లి గ్రామంలో సోమవారం భూ భారతి రెవెన్యూ సదస్సును నిర్వహించనున్నట్లు స్థానిక తహసీల్దార్ దత్తరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

◆ మహా సుదర్శన హోమం



శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం మహా సుదర్శన హోమం నిర్వహించారు. లక్ష్మీనర్సింహస్వామి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా యత్నికులు సముద్రల నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి హోమం చేపట్టారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడి పంటలతో సంతోషంగా ఉండాలనే సంకల్పంతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ధనుంజయ్‌శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శశిధర్ గుప్తా, సిబ్బంది విద్యాకర్‌చారి, నర్సింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఖానాపూర్(కె)లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. నిజాంపేట్ మండలం నాగధర్‌కు చెందిన చిన్న నాయకుని బాలయ్యకు రూ. 60 వేలు, పెద్ద శంకరంపేట్ మండలం టెంకటికు చెందిన జింక కాశిరాంకు రూ. 27 వేల చెక్కులు అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు అంజయ్య, అడివప్ప, గోవింద్, రాజు, సాయిలు, నాగగౌడ్ పాల్గొన్నారు.

◆ యువకుడిని కాపాడిన పోలీసులు

సంగారెడ్డి టౌన్: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకుంటున్నానని 100కు ఫోన్ చేశాడు. స్పందించిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని యువకుడి కాపాడారు. ఈ సంఘటన సంగారెడ్డి మండలం పసల్వాది గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యూసుఫ్ అనే వ్యక్తి కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నారని 100 డయల్ చేయగా కానిస్టేబుళ్లు మహేందర్, మేషక్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని కాపాడి.. కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం యూసుఫ్ బాబాయ్ మౌలానకు అప్పగించారు.